సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025

● నేడు నీలకంఠేశ్వర రథయాత్ర

కోనేరులో విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఆలయ ప్రతిబింబం





మాఘశుద్ధ సప్తమి రోజున మంగళవారం జరుగనున్న ఉత్స వాలకు శ్రీ నీలకంఠేశ్వరాలయం ముస్తాబైంది. రథయాత్ర, జాతరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇం దూరుకు తలమానికంగా నిలుస్తోన్న ఈ ఆలయానికి సుమారు 800 ఏళ్ల చరిత్ర ఉంది.

– నిజామాబాద్ రూరల్

న్యూస్‌రీల్

ఎన్‌ఎన్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీశైలం



నిజామాబాద్‌నాగారం: అఖిల భారతీయ నవజాత శిశు సంఘం (నేషనల్ నియోనాటాలజీ ఫోరం) రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ కొట్బూరు శ్రీశైలం సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌ఎన్‌ఎఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ వీసీ మనోజ్, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ పాల్గొన్నారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి నెల రోజుల పిల్లల మరణాలు తగ్గించేందుకు రాష్ట్రంలో ఏడాది పాటు ప్రత్యేకంగా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణలో శ్రీశైలం శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ కొట్బూరు శ్రీశైలం 25 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం సందర్శించారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

గాయపడిన నెమలికి చికిత్స



వర్ని: వర్ని అటవీ రేంజ్ పరిధిలోని హుమ్నాపూర్ శివారులో గాయాలతో పడి ఉన్న నెమలిని అటవీశాఖ అధికారులు రక్షించి పశు వైద్యాధికారులచే వైద్యం చేయించారు. ఆదివారం రాత్రి గాయాలతో పడి ఉన్న నెమలిని అటవీశాఖ కార్యాలయానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో నెమలికి చికిత్స చేయించారు. గాయాలు నయమైన తర్వాత నెమలిని అడవిలో వదిలివేయనున్నట్లు వర్ని రేంజ్ అధికారి గంగాధర్ వెల్లడించారు.

జిల్లాకు చేరిన కలాం స్ఫూర్తియాత్ర



నిజామాబాద్ అర్బన్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రేరణతో మధులష్ బాబు రాష్ట్రంలో చేపట్టిన 'కలాం స్ఫూర్తియాత్ర' సోమవారం జిల్లా కేంద్రానికి చేరింది. స్ఫూర్తి యాత్ర బస్సును సోమవారం నాగారంలో డీఈవో అశోక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి, అనుభవాధారిత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా స్ఫూర్తియాత్ర చేపట్టడం అభినందనీయమని అన్నారు. వర్క్‌షాప్‌లకు మాత్రమే పరిమితం కాకుండా యువతను నిజ జీవిత సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దేందుకు యాత్ర తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ గంగా కిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: 'నులిపురుగుల నిర్మూలన' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వయసు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఈ మాత్రలు వేస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బీ రాజశ్రీ మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల ఆరోగ్యానికి మంచిదన్నారు. భోజనం చేసిన తర్వాతనే ఈ మాత్ర చప్పరించి నమిలి తీసుకునే విధంగా విద్యార్థులకు పాఠశాలల్లో ప్రార్థన సమయంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేయకుంటేే ఉద్యమిస్తాం

కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) పై ఉద్యోగ, ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. ఏ రకంగా చూసినా పాత పెన్షన్ విధానం కంటే మెరుగైనది కాదంటున్నారు. సీపీఎస్, యూపీఎస్‌లను వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఉపాధ్యాయులు ఉద్యమానికి సిద్ధమంటున్నారు.



యూపీఎస్ విధానం రద్దు చేయాలని ధర్పల్లి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ఏకీకృత పెన్షన్ పథకంపై భగ్గుమంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు
- నూతన పెన్షన్ స్కీమ్ గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కేంద్ర ప్రభుత్వం వారం రోజుల క్రితం విడుదల చేసిన గెజిట్‌లో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) లోపభూయిష్టంగా ఉండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులను యూపీఎస్ విధానంలో ఆర్థిక ప్రయోజనాలు అంతంత మాత్రంగానే ఉండటం ఆందోళనకు గురి చేస్తోంది. పది రోజుల క్రితం యూపీఎస్ పై కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. యూపీఎస్ విధానం పాత పెన్షన్ విధానం కంటే మేలైనది కాదని, ఏకీకృత పెన్షన్ మరో అసంపూర్ణ పెన్షన్ పథకం అని ఉద్యోగులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన పెన్షన్ పథకాలైన సీపీఎస్, యూపీఎస్‌లను వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. యూపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

సీపీఎస్ మరో గుదిబండ..

2003 లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం 2004 అక్టోబర్ తర్వాత ప్రభుత్వ కొలువులు సాధించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుదిబండగా మారింది. ఉద్యోగి మూలధనం 10 శాతం, దానికి సమానమైన సొమ్మును ప్రభుత్వం షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడుతుంది. పదవీ విరమణ వరకు పొదుపు చేసిన సొమ్ముకు పన్ను వర్తింప జేసి అందులో 60 శాతం ఉద్యోగికి చెల్లిస్తారు. 40 శాతం షేర్ మార్కెట్ నుంచి సంవత్సర లాభాలు దామాషా పద్ధతిలో ప్రతి నెలా పెన్షన్‌గా చెల్లిస్తారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కనీసం పెన్షన్ రూ.2వేలు కూడా రావడం లేదు. అలాగే సీపీఎస్ ఉద్యోగులు జమచేసిన 10 శాతం వేతనానికి సంబంధించిన మిస్సింగ్ క్రెడిట్స్ కొండల్లా పెరుగుతున్నాయి. జమ అయిన మొత్తమంతా కేంద్ర ప్రభుత్వ ఖజానాలో ఉంది. సీపీఎస్ ను రద్దు చేసిన రాష్ట్రాలకు కేంద్రం ఈ నిధులను ఇవ్వడం లేదు.

పాత పెన్షన్ పథకం అమలుకు డిమాండ్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరైన ఆర్థిక భద్రత ఇవ్వని సీపీఎస్, యూపీఎస్ పథకాలను రద్దు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) లో పెన్షన్‌దారులు మరణిస్తే అతనిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఎలాంటి కోత లేకుండా పూర్తి పెన్షన్ వస్తుంది. పాత పెన్షన్ పథకం కోసం ఉద్యోగి జీతంలో ఎలాంటి కోతలు ఉండవు. ఒక ఉద్యోగి పదవీ విరమణ పొందే నాటికి అతని చివరి జీతంలో 50 శాతం పెన్షన్‌గా చెల్లిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పుడు డీఏ పెరిగినా పెన్షన్‌దారులకు ఆర్థిక భరోసా వస్తుంది. వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) సిఫారసులు కూడా అమలవుతాయి. ఇంతటి ఆర్థిక ప్రయోజనాలు ఉన్న పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, లేకపోతే పోరాటాలే శరణ్యమవుతాయని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాయి.

యూపీఎస్ మరో అసంపూర్ణ పథకం..

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ పథకం) ఏరకంగా చూసినా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అంత మెరుగైనది కాదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇందులో పెన్షన్ హామీ కేవలం రూ.10 వేలుగా ఉంటుంది. పెన్షన్ కోసం కనీస సర్వీస్ 25 సంవత్సరాలు ఉండాలి. కనీస కుటుంబ పెన్షన్ ఇందులో లేదు. పదేళ్లకంటే తక్కువ సర్వీస్ ఉంటే ఎలాంటి పెన్షన్ చెల్లింపులు ఉండవు. యూపీఎస్ పెన్షన్ పథకంలో ప్రావిడెంట్ ఫండ్ పథకం గురించి ప్రస్తావించలేదు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగిస్తోంది. యూపీఎస్ లో ఉన్న మరో ప్రమాదకర అంశం ఏంటంటే ఉద్యోగి భాగస్వామ్య వాటా. సీపీఎస్‌లో లాగా కాంట్రిబ్యూషన్లను తీసుకుని పెన్షన్ ఇచ్చే పద్ధతిని అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. యూపీఎస్ ప్రకటనతో సీపీఎస్ విధానం సరైంది కాదని మాత్రం కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లేనని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

యూపీఎస్‌తో ఎటువంటి ప్రయోజనం లేదు



కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) మరో అసంపూర్ణ పథకం. దీనివల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నూనత పెన్షన్ పథకాలైన సీపీఎస్, యూపీఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అమలు చేయాలి. – గంగోని కిషన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నూతన పెన్షన్ పథకాలను రద్దు చేయాలి



నూతన పెన్షన్ పథకాలైన యూపీఎస్, సీపీఎస్ లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. వీటివల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం కంటే నష్టం ఎక్కువగా ఉంది. కాబట్టి ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) అమలు చేయాలి. – సురేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలి. నాడు ఎంతో గొప్పదని ప్రవేశ పెట్టిన సీపీఎస్ విధానం వల్ల 2004 నుంచి దేశ వ్యాప్తంగా లక్షలాది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సీపీఎస్ విధానం పై వస్తున్న వ్యతిరేకతను, చేస్తున్న ఉద్యమాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు మరో కొత్త విధానం అమలు చేస్తామని చెప్పడమంటే మసిపూసి మారేడు కాయ చేయడమే తప్ప మరోటి కాదు. ఒక్కసారి పార్లమెంట్, అసెంబ్లీకి ఎంపికైన ప్రజా ప్రతినిధులకు కూడా పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నారు. 30 సంవత్సరాలకు పైబడి ప్రభుత్వ సేవకులుగా పని చేసిన ఉద్యోగులకు పెన్షన్ గ్యారెంటీ లేకపోవడం దారుణం. పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు మా పోరాటం కొనసాగుతుంది. – డి. సత్యానంద్, టీఎస్‌యూటీఫ్, రాష్ట్ర కార్యదర్శి

ఉద్యోగులకు సామాజిక భద్రత ఉండదు



ఏకీకృత పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత ఉండదు. ఉద్యోగు లు, ప్రభుత్వం పెన్షన్ కోసం చెల్లించే సొమ్మును మరింత ఎక్కువగా షేర్ మార్కెట్ లోకి తరలించడానికి కేంద్రానికి వెసులుబాటు లభిస్తుందే తప్ప.. దీని వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు అదనపు ప్రయోజనాలు లభించే అవకాశం లేదు.– జి.ప్రశాంత్, పీఎస్ హెచ్‌ఎం అసోసియేట్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

నిజామాబాద్ సీటీ : కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పులాంగ్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం.. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణాకు నిధులు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపిందని మండిపడ్డారు. కేంద్రానికి తెలంగాణ ప్రజల పన్నులు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. జాతీయ పసుపుబోర్డు తెచ్చానని చెప్పుకుంటున్న ఎంపీ అరివ్వింద్ బోర్డుకు తగిన నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నాయకులు జావేద్ అక్రమ్, విపుల్ గౌడ్, కేశ మహేష్, అబుద్ బిన్ హందాన్, ఉబేద్ బిన్ హందాన్, ప్రమోద్, గడుగు రోహిత్, పోల ఉష, విజయలక్ష్మి, గాజుల సుజాత, మల్లైకా బేగం, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలు 307

- జనాభా ప్రాతిపదికన పెరిగిన స్థానాలు
- 31కి చేరిన ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు
- కసరత్తు పూర్తి చేసిన అధికారులు
- తుది జాబితా విడుదల

నిజామాబాద్‌రూరల్/మోపాల్: జిల్లాలో ఎంపీటీసీ స్థానాల విభజన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. తుది జాబితాను సోమవారం ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ స్థానాలను పునర్విభజన చేశారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో సైతం ఎంపీటీసీ స్థానాలను గుర్తించారు. 299 స్థానాలకుగాను కొత్తగా ఏర్పడిన 8 స్థానాలను కలిపి మొత్తం 307 ఎంపీటీసీ స్థానాలకు పెరిగాయి.

కొత్తగా చందూర్‌లో 2 ఎంపీటీసీ స్థానాలు, మోస్రాలో 2 ఎంపీటీసీ స్థానాలు, మాక్లూర్, నందిపేట్, డొంకేశ్వర్, సాలూర మండలానికి ఒకటి చొప్పున ఎంపీటీసీ స్థానాలను గుర్తించారు. తాజాగా పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి.

జిల్లాలో మొత్తం 31 మండలాలు ఉండగా ఇందులో నూతనంగా డొంకేశ్వర్, పోతంగల్, ఆలూరు, సాలూర నాలుగు మండలాలు ఏర్పాటయ్యాయి. ఆయా గ్రామాలను కలుపుకుని ఎంపీటీసీ స్థానాలను గుర్తించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన నాలుగు మండలాల్లోనూ ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. నందిపేట్ మండలం నుంచి డొంకేశ్వర్, కోటగిరి నుంచి పోతంగల్, బోధన్ నుంచి సాలూర, ఆర్మూర్ నుంచి ఆలూర్ మండలాలను విభజించారు. అత్యధికంగా డిచ్‌పల్లిలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అత్యల్పంగా చందూర్, మోస్రా, ఏర్గట్లలో 5 చొప్పున ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో 27 మండలాలకు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నిక లు జరిగాయి. ప్రస్తుతం వీటి సంఖ్య 31కి పెరిగింది. బీసీ కులగణన కొలిక్కి వచ్చిన తర్వాతే రిజర్వేషన్లను ప్రకటించనున్నారు. ఆశావహులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయనే ధీమాతో ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.



జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు ఇలా ఉన్నాయి

మండలం	జనాభా	ఎంపీటీసీ స్థానాలు	మండలం	జనాభా	ఎంపీటీసీ స్థానాలు	మండలం	జనాభా	ఎంపీటీసీ స్థానాలు
			ఇందల్వాయి	37,233	11	నవీపేట్	55,125	16
			జక్రాన్‌పల్లి	45,505	13	నిజామాబాద్	27,397	08
ఆలూరు	29,117	09	కమ్మర్‌పల్లి	36,678	10	పోతంగల్	26,151	08
ఆర్మూర్	37,880	11	కోటగిరి	23,786	07	రెంజల్	38,880	11
బాల్కొండ	31,861	09	మాక్లూర్	37,096	11	రుద్రూర్	21,909	06
భీంగల్	47,806	14	మెండోరా	28,439	08	సాలూర	21,473	07
బోధన్	39,608	11	మోర్తాడ్	33,346	10	సిరికొండ	41,679	12
చందూర్	10,893	05	మోస్రా	13,452	05	వేల్పూర్	46,739	13
డొంకేశ్వర్	20,588	07	మోపాల్	37,436	11	వర్ని	32,956	09
ధర్పల్లి	38,340	11	ముప్కాల్	20,703	06	ఎడపల్లి	40,028	11
డిచ్‌పల్లి	60,492	17	నందిపేట్	50,010	15	ఏర్గట్ల	18,554	05

జిల్లా జైలులో చేనేత యూనిట్ ప్రారంభం



చేనేత మిషన్‌లను పరిశీలిస్తున్న డీజీ సౌమ్య

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్ర శివారు సారంగపూర్‌లోని జిల్లా జైలులో చేనేత మిషన్ల యూనిట్‌ను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 26 మంది ఖైదీలతో 13 చేనేత మిషన్ల ద్వారా బట్టలను తయారు చేయిస్తామన్నారు. ఇందులో క్లాత్, టవల్స్, నాప్‌కిన్స్, బెడ్‌షీట్స్‌లను తయారు చేస్తారన్నారు. వీటిని ఖైదీలతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. వరంగల్ జైలులో చేనేత యూనిట్‌ను మూసివేసిన తర్వాత వీటికి సంబంధించిన మిషన్లను చర్లపల్లి జైలుకు తరలించినట్లు తెలిపారు. 2021లో నిజామాబాద్ జైలు అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఇక్కడ స్టీల్ ఇండస్ట్రీస్, ప్రింటింగ్ ప్రెస్, టైలరింగ్, ఫినాయిల్ వంటి యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు చేనేత యూనిట్‌ను ప్రారంభించామన్నారు. అనంతర జైలులో ఉన్న వసతులను పరిశీలించి, ఖైదీల వివరాలను జైలు సూపరింటెండెంట్ ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జైలుకు అనుబంధంగా ఉన్న కామారెడ్డి సబ్ జైలును డీజీ సౌమ్య మిశ్రా సందర్శించారు. జైలులోని వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వరంగల్ డీఐజీ ఎం. సంపత్, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ, ట్రైనీ ఐపీఎస్ అధికారి సాయికిరణ్, జైలర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు టున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి దినేశ్

- ప్రకటించిన రాష్ట్ర నాయకత్వం



సుభాష్‌నగర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దినేశ్ పటేల్ కులాచారిని రాష్ట్ర నాయకత్వం సోమవారం ప్రకటించింది. దినేశ్‌కు పార్టీ మరోసారి అవకాశం కల్పించింది. రెండ్రోజుల క్రితం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా దినేశ్ ఒక్కరే జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ ప్రత్రాన్ని అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన దినేశ్‌కు 50 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం జిల్లా అధ్యక్ష పదవితోపాటు జిల్లా కౌన్సిల్ సభ్యుల పేర్లను కూడా ప్రకటించారు. నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఐదుగురు నియమితులయ్యారు. నాగ సురేష్ (ఆర్మూర్), శైలేష్ కుమార్ (బోధన్), బీ వరలక్ష్మి (నిజామాబాద్ అర్బన్), నేనావత్ ఓం సింగ్ (నిజామాబాద్ రూరల్), కర్నె లక్ష్మీనారాయణ (బాల్కొండ) జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నియామకమయ్యారు.

క్లుప్తంగా

ఎక్స్‌గ్రేషియా వేగంగా అందించాలి



మోర్తాడ్‌: గల్ఫ్‌ దేశాల్లో మృతి చెందిన తెలంగాణ వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను వేగంగా అందించాలని వలస కార్మికులు తెలంగాణ మైనింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ను కోరారు. సోమవారం దుబాయిలో పర్యటించిన ఈరవత్రి అనిల్‌ను జిల్లాకు చెందిన పలువురు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రఘు, ఆడెం ప్రతాప్‌, సతీశ్‌, సురేశ్‌ కాసర్ల తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నిజామాబాద్‌ అర్బన్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ ద్వారా నిర్వహించే పదో తరగతి, ఇంటర్‌ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అదనపు రుసుముతో ఈనెల 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించొచ్చని సూచించారు. టీఎస్‌ ఆన్‌లైన్‌, మీసేవ సెంటర్‌లలో పరీక్ష ఫీజును చెల్లించాలని డీఈవో పేర్కొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్‌: నగరంలోని ఆర్యనగర్‌–1 ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్‌–3 ఏడీఈ పి వీరేశం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాయత్రినగర్‌ రోడ్‌ నంబర్‌ 1, 2, 3, 4, 5, ఆకుల పాపయ్య కాలనీ, చింతచెట్టు మైసమ్మ, కాశీనగర్‌, సిద్ధి వినాయక రోడ్డు, ఆర్యవైశ్య సంఘం, న్యాల్‌కల్‌ రోడ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. విద్యుత్‌ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దుబ్బ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

నగరంలోని 11 కేవీ రైతుబజార్‌ ఫీడర్‌ దుబ్బ సబ్‌ స్టేషన్‌ నిర్వహణ కారణంగా మంగళవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్‌–2 ఏడీఈ ఆర్‌ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. న్యూ ఎన్జీవోస్‌ కాలనీ, రైతుబజార్‌, గౌతమ్‌నగర్‌, తదితర కాలనీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎర్రజొన్న ధరకు సిండికేట్‌ కళ్లెం

- ఒక్కటైన వ్యాపారులు
- నిలువ చేసేందుకే రైతుల ప్రాధాన్యం
- గతంతో పోలిస్తే క్వింటాల్‌కు రూ.700 తగ్గిన ధర
- తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్న రైతులు



విక్రయించకుండా నిలువ చేసిన ఎర్రజొన్నలు



ఆరబోసిన ఎర్రజొన్నలు

మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన రైతు బూత్‌పురం మహిపాల్‌ తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన ఎర్రజొన్నలను విక్రయించేందుకు ఆసక్తి చూపడం లేదు. క్వింటాల్‌కు రూ.700 వరకు ధర తగ్గించడంతో ఎర్రజొన్నలను నిలువ చేసుకుని ధర లభించిన సమయంలోనే విక్రయించాలని అనుకుంటున్నాడు.

ఇది ఒక్క రైతు మహిపాల్‌ నిర్ణయమే కాదు. ఎర్రజొన్నలను సాగు చేసిన అనేక మంది రైతులు పంటను నిలువ చేసుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో క్వింటాల్‌ ఎర్రజొన్నలకు రూ.4,500 ధర లభించగా ఈసారి మాత్రం రూ.3,800కు మించి ధర లేదని వ్యాపారులు చెబుతుండగా.. సీడ్‌ వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. సీడ్‌ పంట సాగు, ధర నిర్ణయం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేకపోవడంతో రైతులు సీడ్‌ వ్యాపారులనే నమ్ముకోవాల్సి వస్తోంది. జొన్నల సాగు విషయంలో బైబ్యాక్‌ ఒప్పందాలు లేకుండా ఎవరూ పంట సాగు చేయొద్దని వ్యవసాయ శాఖ ప్రచారం నిర్వహించింది. రైతులు మాత్రం పంట సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ధర పెరుగుతుందనే ధీమాతో ఎర్రజొన్నలను సాగు చేశారు.

బళ్లారితో పోలిస్తే భిన్నమైన పరిస్థితులు

కర్ణాటకలోని బళ్లారిలో ఎర్రజొన్న సాగవుతోంది. అక్కడి రైతులు నిజామాబాద్‌ జిల్లాలో కన్నా ముందే పంట సాగు చేయడం, కోతలు పూర్తి చేయడం చేస్తారు. బళ్లారి పంటకు ఇక్కడి పంటకు నాణ్యతలో ఎంతో తేడా ఉంటుంది. అందుకే అక్కడికంటే ఎక్కువ ధర మన పంటకు లభిస్తుంది. బళ్లారిలో క్వింటాల్‌ ఎర్రజొన్నలను అక్కడి రైతులు రూ.3,800కు విక్రయించారు. ఈ లెక్కన మన ప్రాంతంలోని పంటకు రూ.4వేలకు మించి ధర లభించాలి. గతంలోనూ బళ్లారి ధరకు ఇక్కడి ధరకు రూ.200 నుంచి రూ.500 వరకు తేడా ఉంది. ఈసారి మాత్రం అక్కడి ధరనే వర్తింపజేయాలని వ్యాపారులు నిర్ణయించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సీడ్‌ వ్యాపారులు ధరను తగ్గించి ఎక్కువ లాభం పొందాలను చూస్తున్నారని రైతులు ఐక్యంగా ఉంటే ధర ఖచ్చితంగా లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నష్టపరచాలని చూస్తున్నారు



సీడ్‌ వ్యాపారులు రైతులను నష్టపర్చాలని చూస్తున్నారు. పంటల సాగు ఖర్చులు పెరుగుతుంటే ధర తగ్గించి లాభం లేకుండా చేస్తున్నారు. వ్యాపారుల సిండికేట్‌ను కట్టడి చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. రైతుల శ్రమను దోచుకునేవారికి బుద్ధి చెప్పాలి.

– కుంట రవిశంకర్‌ రెడ్డి, రైతు, పాలెం

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన జిల్లాకు చెందిన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు పతకాల పంట పండింది. జనవరి 31 నుంచి ఈనెల 3వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిశూల్‌ జిల్లా కున్నంగుళంలో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించిన నిజామాబాద్‌ జిల్లా మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ 22 మెడల్స్‌ సాధించారు. రాష్ట్రాన్ని రెండో స్థానంలో నిలిపారు. జిల్లాకు చెందిన అథ్లెట్స్‌ను అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీను నాయక్‌, ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి, ట్రెజరర్‌ నీతారెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ కిరణ్‌కుమార్‌ అభినందించారు.

పతకాలు సాధించింది వీరే..

దినేశ్‌ వాగ్మారే (లాంగ్‌ జంప్‌, సిల్వర్‌ మెడల్‌), గోపి, ఉత్తమ్‌ (సిల్వర్‌, హార్‌డిల్స్‌), ఎస్‌ వెంకటేశ్‌ (హై జంప్‌, బ్రాంజ్‌ మెడల్‌), జి రఘువీర్‌ (షాట్‌పుట్‌, బ్రాంజ్‌ మెడల్‌), ఎం నర్సయ్య (5కే రన్‌, గోల్డ్‌ మెడల్‌), ఆమేర్‌ అలీ (5కే రన్‌, సిల్వర్‌ మెడల్‌), పద్మ (400, 800 మీటర్స్‌ గోల్డ్‌ మెడల్‌), సౌజన్య (హై జంప్‌, గోల్డ్‌ మెడల్‌), స్రవంత్రి (జావెలిన్‌ త్రో, బ్రాంజ్‌ మెడల్‌), షద్రక్‌ (ట్రిపుల్‌ జంప్‌, బ్రాంజ్‌ మెడల్‌), గోపి (ట్రిపుల్‌ జంప్‌, సిల్వర్‌ మెడల్‌), దినేశ్‌ (ట్రిపుల్‌ జంప్‌, బ్రాంజ్‌ మెడల్‌, 100 మీటర్స్‌ రిలే, సిల్వర్‌ మెడల్‌), పల్లవి రెడ్డి (400 మీటర్స్‌ హార్డిల్స్‌, గోల్డ్‌ మెడల్‌), సౌజన్య (ట్రిపుల్‌ జంప్‌, గోల్డ్‌ మెడల్‌), స్రవంతి (ట్రిపుల్‌ జంప్‌, బ్రాంజ్‌ మెడల్‌), అషీలి గోపి (400 మీటర్స్‌ హార్డిల్స్‌, గోల్డ్‌మెడల్‌), దినేశ్‌ వాగ్మారే (100 మీటర్స్‌, బ్రాంజ్‌ మెడల్‌), జి రఘువీర్‌ (హ్యామర్‌ త్రో, బ్రాంజ్‌ మెడల్‌), ఎల్‌ పద్మ (5కే రన్‌, సిల్వర్‌ మెడల్‌).

పోలీస్‌ స్పోర్ట్స్‌ మీట్‌లో ప్రతిభ



బోధన్‌ టౌన్‌ (బోధన్‌): కరీంనగర్‌లో జనవరి 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించిన 3వ తెలంగాణ స్టేట్‌ పోలీస్‌ గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ మీట్‌లో బోధన్‌ డివిజన్‌కు చెందిన ఐదుగురు పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వివిధ పోటీల్లో రెండు బంగారు, రెండు వెండి, ఆరు కాంస్య పతకాలను సాధించారని ఏసీపీ శ్రీనివాస్‌ తెలిపారు. స్పోర్ట్స్‌ మీట్‌లో ప్రతిభచూపిన సిబ్బందిని బోధన్‌ పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం ఆయన అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. రుద్రూర్‌ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎండీ అఫ్సర్‌ స్విమ్మింగ్‌లో ఒక బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలను, బోధన్‌ పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సాయికృష్ణ రన్నింగ్‌లో ఒక బంగారు పతకాన్ని సాధించారని, అలాగే ఏఎస్సై గంగాప్రసాద్‌ టేబుల్‌ టెన్నిస్‌లో ఒక కాంస్య పతకం, బోధన్‌ రూరల్‌ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న నరేందర్‌ మూడు విభాగాల్లో మూడు కాంస్య పతకాలు, కోటగిరి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అరుణ్‌కుమార్‌ కరాటేలో ఒక బంగారు పతకాన్ని సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణికి 141 ఫిర్యాదులు

- పరిశీలించిన కలెక్టర్‌ హనుమంతు
- సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 141 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, ఆర్డీవో రాజేంద్రకుమార్‌, మెప్మా పీడీ రాజేందర్‌, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను సూచించారు. ఈ సందర్భంగా డీ వార్మింగ్‌డేను పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్‌ రాజశ్రీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనంగా రేషన్‌ బియ్యం కేటాయించాలి

తమకు అదనంగా రేషన్‌ బియ్యం కేటాయించాలని నగరంలోని ద్వారకానగర్‌కు పలువురు వితంతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అందిస్తున్న రేషన్‌ బియ్యంసరిపోవడం లేదన్నారు.

అలీసాగర్‌లో జైళ్లశాఖ డీజీ బోటింగ్‌



ఎడపల్లి(బోధన్‌): మండలంలోని అలీసాగర్‌ ఉద్యానవనాన్ని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, ఇన్‌చార్జి సీపీ సింధు శర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అలీసాగర్‌ హరిత హోటల్‌ను పరిశీలించిన అనంతరం బోటింగ్‌ చేశారు. అలీసాగర్‌ ద్వారా సాగునీరు అందడంతో పాటు జిల్లా ప్రజలు పిక్నిక్‌ స్పాట్‌గా ఉందని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బాసర, జానకంపేట్‌ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చిన భక్తులు అలీసాగర్‌ను సందర్శించి బోటింగ్‌ చేస్తారని స్థానికులు డీజీకి తెలిపారు.

వైభవంగా నీలకంఠుడి పల్లకీసేవ



నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో సోమవారం ఉత్సవ మూర్తులతో పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీరాం రవీందర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి పల్లకీని మోసేందుకు పోటీపడ్డారు.

విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవాలి



నిజామాబాద్‌ అర్బన్‌: విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలకు అండగా నిలవాలని కమ్యూనిటీ వలంటీర్లకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. ఎంపిక చేసిన సుమారు 300 మంది కమ్యూనిటీ వలంటీర్లకు విపత్తులను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఇరవై రోజుల పాటు ‘ఆపద మిత్ర’ పేరుతో కొనసాగనున్న శిక్షణను అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్‌ సోమవారం న్యాక్‌ భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిపరంగా లేదా మానవ తప్పిదాల కారణంగా విపత్తులు సంభవించిన సందర్భాల్లో స్థానికంగా ఉండే సామాజిక కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో వారికి ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బందితోపాటు అగ్నిమాపక తదితర శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి.పరమేశ్వర్‌, కలెక్టరేట్‌లోని విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో ఒకరికి డెంగీ



మాక్లూర్‌: మండల కేంద్రానికి చెందిన ఒకరు డెంగీ బారినపడ్డారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో కలిసి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సోమవారం రోగి ఇంటి పరిసరాలతోపాటు డ్రెయినేజీలను శుభ్రం చేసి స్ప్రే చేశారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యవేక్షణ సి బ్బంది సుధాకర్‌, ఏఎన్‌ఎం కమల, ఆశ కా ర్యకర్తలు శిరీష, జయశీల, జ్యోతి, కరీమా, శిరీష పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

సీజ్‌ చేసిన ఇసుక వేలం

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని మారంపల్లిలో ఇటీవల సీజ్‌ చేసిన ఇసుకను తహసీల్దార్‌ నరేశ్‌ సమక్షంలో సోమవారం వేలం వేశారు. మొత్తం 16 ట్రాక్టర్ల ఇసుక ఉండగా నలుగురు వ్యక్తులు వేలంలో పాల్గొన్నారు. ట్రాక్టర్‌కు రూ.1,210 చొప్పున పాటపాడి మారంపల్లికి చెందిన కాశపురం రవి ఇసుక డంప్‌ను దక్కించుకున్నారు. ఇసుక పట్టుబడిన రోజున అది తనదేని ముందుకు వచ్చిన వ్యక్తి వేలంలో ఇసుకను దక్కించుకున్న వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం. అతడి వద్ద ఆధారాలు లేకపోవడంతో అధికారులు ఇసుకను వేలం వేయాల్సి వచ్చింది. వేలం ద్వారా సమకూరిన డబ్బును ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు తహసీల్దార్‌ వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌



రాజంపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు. లేత మామిడి తండా నుంచి ఇతర గ్రామాలకు ఇసుక సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున దాడి చేసి ఇసుక తరలిస్తున్న నడిమితండాకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్‌ చేశామన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను చాకచక్యంగా పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్‌ రమేశ్‌, కానిస్టేబుళ్లు సురేశ్‌, చరణ్‌ను ఎస్సై అభినందించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మారుతినగర్‌ కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య సోమవారం తెలిపారు. ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మారుతినగర్‌లో దాడి చేసి వ్యభిచార గృహం నిర్వాహకురాలితోపాటు ముగ్గురు బాధిత మహిళలు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.3,660 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం రూరల్‌ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

కోడి పందాల స్థావరంపై..

నవీపేట: మండలంలోని నాడాపూర్‌, కమలాపూర్‌ గ్రామాల మధ్య రహస్యంగా కొనసాగుతున్న కోడి పందాల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. ఆరుగురిని అరెస్టు చేశామని, రెండు కోడి పుంజులతోపాటు రూ.4,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇద్దరి బైండోవర్‌

భిక్కనూరు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తప్పుడు ప్రచారం చేస్తున్న తిప్పాపూర్‌ గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. మండలంలోని తిప్పాపూర్‌ గ్రామంలో ఈనెల 1న పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీస్‌ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీసి సోషల్‌ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఇల్లందుల ప్రభాకర్‌, ఇల్లందుల నరేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. వారిద్దరిని తహసీల్దార్‌ శివప్రసాద్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్నూకర్‌ సెంటర్‌ల తనిఖీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో కొనసాగుతున్న స్నూకర్‌ సెంటర్‌లను ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. అనుమతి లేని స్నూకర్‌ సెంటర్ల నిర్వాహకులతో మాట్లాడారు. స్నూకర్‌ సెంటర్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

వేర్వేరు చోట్ల ఆరుగురి మృతి

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆరుగురు వివిధ కారణాలతో మృతి చెందారు. చెరువులో పడి ఒకరు, కాలువలో పడి మరొకరు, అనారోగ్యంతో ఇద్దరు, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.

వర్ని (మోస్రా): మోస్రా మండలం గోవూరుకు చెందిన దండు చిన్న పోశెట్టి (77) అనే వ్యక్తి మోస్రా చెరువులో పడి మృతి చెందినట్లు వర్ని ఎస్సై రమేశ్‌ సోమవారం తెలిపారు. పోశెట్టికి మతిస్థిమితం సరిగా లేదని సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద కాలువలో పడి..

వేల్పూర్‌: మండలంలోని పోచంపల్లి గ్రామం వద్ద శ్రీరాంసాగర్‌ వరదకాలువలో ప్రమాదవశాత్తు పడి రాజు(45) అనే వ్యక్తి మరణించినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన రాజు భార్య సంగీతతో కలిసి సుమారు ఆరేళ్లుగా అంక్సాపూర్‌ గ్రామంలో ఉంటూ కూలీగా పని చేస్తున్నాడు. భార్య ఇటీవల కొమురవెల్లి జాతరకు వెళ్లగా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. పోచంపల్లి గ్రామస్తులు వరదకాలువ వైపు వెళ్లగా రాజు మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రాజు భార్య సంగీత ఘటనాస్థలానికి చేరుకొని తీవ్రంగా రోదించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దోమకొండ వాసి..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అన్నం లక్ష్మీనారాయణగౌడ్‌(59) సోమవారం మహబూబ్‌నగర్‌ జిల్లా అచ్చంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన లక్ష్మీనారాయణగౌడ్‌ కారులో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఆయన మృతి చెందగా, గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



లక్ష్మీనారాయణగౌడ్‌ (ఫైల్‌)

పరిస్థితి విషమించి గుర్తుతెలియని వృద్ధురాలు..

ఇందల్వాయి: మూడు రోజుల క్రితం ఇందల్వాయి టోల్‌ ప్లాజా వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 59854 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.



వృద్ధురాలి మృతదేహం

అనారోగ్యంతో రిటైర్డ్‌ టీచర్‌..

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్‌ ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడు మహ్మద్‌ అహ్మద్‌ పాషా ((80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పాషా ఇంగ్లిష్‌ ఉపాధ్యాయుడిగా భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేశారు. ఇంగ్లిష్‌ బోధనలో ఆయనకు ఎవరూ సాటిరారని స్థానికులు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ గత కొంతంగా హైదరాబాద్‌లో ఉంటున్న పాషా మృతి చెందగా సోమవారం రాత్రి అంత్యక్రియలను అక్కడే నిర్వహించారు. మండలానికి చెందిన పలువురు రిటైర్డ్‌ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాషా వద్ద ఇంగ్లిష్‌ నేర్చుకున్న శిష్యులు అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



అహ్మద్‌ పాషా(ఫైల్‌)

సౌదీలో చంద్రాయాన్‌పల్లికి చెందిన వ్యక్తి..

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయాన్‌పల్లి గ్రామ పరిధిలోని గోల్యా నాయక్‌ తండాకి చెందిన మోహన్‌నాయక్‌(43) అనే వ్యక్తి ఆదివారం రాత్రి సౌదీలో మృతి చెందాడు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అనారోగ్యానికి గురైన మోహన్‌ నాయక్‌ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. 12 ఏళ్లుగా సౌదీలో ఉంటున్నాడని, అతడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారన్నారు. మృతదేహాన్ని త్వరగా గ్రామానికి రప్పించాలని మృతుడి బంధువులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

రుద్రూర్‌/నందిపేట్‌: మద్యానికి బానిసై వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రుద్రూర్‌ మండలం అంబం(ఆర్‌)లో పిట్ల శ్రీనివాస్‌, నందిపేట్‌ మండల వన్నెల్‌(కే)లో ఇండ్ల కృష్ణ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి..



శ్రీనివాస్‌ (ఫైల్‌)

బోధన్‌కు చెందిన పిట్ల శ్రీనివాస్‌(40) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువుకోసం రుద్రూర్‌ మండలం అంబం (ఆర్‌) గ్రామానికి వచ్చి స్థిరపడ్డాడు. మేస్త్రీగా పని చేస్తూ శ్రీనివాస్‌ కుటుంబాన్ని పోషించేవాడు. ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు అతడి కాలు విరగగా, అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. చికిత్స అనంతరం కాలు నయమైనప్పటికీ పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటుండడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం భార్య గంగాలత బ్యాంకు పని నిమిత్తం రుద్రూర్‌కు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీనివాస్‌ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. తన భర్త మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.



కృష్ణ మృతదేహం

నందిపేట మండలం వన్నెల్‌(కే) గ్రామంలో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లా జొన్నాడ గ్రామానికి చెందిన ఇండ్ల కృష్ణ (32) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇండ్ల కృష్ణ గత రెండు సంవత్సరాల క్రితం నెల్లూరు నుంచి వన్నెల్‌ (కే) గ్రామానికి వచ్చి గౌసుద్దీన్‌ అనే వ్యక్తికి చెందిన ఇటుక బట్టీలో కుటుంబ సభ్యులతో కలిసి పనిచేసుకుంటూ ఇక్కడే ఉండేవాడు. గత కొన్ని రోజులుగా ఇండ్ల కృష్ణ తాగుడికి బానిసై పనికి సరిగా వెళ్లడంలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇటుక బట్టీ ఆవరణలో ఉన్న వేపచెట్టుకు ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న ఇండ్ల మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బంగారం, వెండి చోరీ



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండలంలోని తొండాకూర్‌ గ్రామానికి చెందిన నామ్‌తాబాద్‌ భాను అనే మహిళ ఇంట్లో దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడి బంగారం, వెండితోపాటు నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భానుతోపాటు ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటికి తాళం వేసి జీజీ నడ్కుడలో నిర్వహిస్తున్న అగ్గి మల్లన్న జాతరకు వెళ్లారు. రాత్రి అక్కడే జాగారం చేసి సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడడంతోపాటు బీరువా తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం, 25తులాల వెండి, రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్‌ టీమును రప్పించి ఆధారాలు సేకరించారు.